క్లుప్తంగా

'సర్వేపల్లి' విగ్రహావిష్కరణ



సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని ఆవిష్కరించిన గ్రామస్తులు

పూసపాటిరేగ: మండలంలోని కనిమెల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించారు. గ్రామానికి చెందిన దుప్పాడ త్రినాద్ జ్ఞాపకార్థం ఆయన భార్య జానకి సహకారంతో విగ్రహాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలు విద్యార్థులు గుర్తించి భావితరాలకు మంచి పౌరులుగా, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలి అన్నారు. కార్యక్రమంలో పూసపాటిరేగ ఎస్ఐ బాలకృష్ణ, పాఠశాల హెచ్‌ఎం ఎ.కృష్ణారావుతో పాటు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు వెంపడాం విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వెంపడాం విద్యార్థులు

పూసపాటిరేగ: మండలంలోని వెంపడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి రన్నింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 10న విజయనగరంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో 100 మీటర్లు, 200 మీటర్లు పరుగు పోటీలో పాఠశాలకు చెందిన ఎం.హరిత, వి.అలేఖ్య, కె.జానకి విజేతలుగా నిలిచారు. వీరు ఈ నెల 23 నుంచి 25 వరకు గుంటూరు జిల్లా నరసారావుపేటలో జరగబోయే పోటీలలో పాల్గొననున్నారు. పాఠశాల హెచ్‌ఎం లచ్చన్న, పీడీ గణేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నిక



ఏపీఎస్‌పీ బెటాలియన్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

డెంకాడ: చింతలవలస ఐదవ ఏపీఎస్‌పీ బెటాలియన్ ఏపీ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగిందని నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మ మహేష్, పి.రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం అధ్యక్షుడిగా తుమ్మ మహేష్, వైస్ ప్రెసిడెంట్‌గా టి.తవిటి నాయుడు, సెక్రటరీగా పి.రవికుమార్, ట్రెజరర్‌గా కె.సత్యవతి, జాయింట్ సెక్రటరీగా ఎం.నరేష్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఐ.భవాని ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు తెలిపారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా బి.గీత, బి.దివాకర్‌చౌదరి, సీహెచ్ సత్యనారాయణ, ఎం.గోవిందరావు, జి.అప్పారావు ఎన్నికైనట్టు వివరించారు.

'ప్రజా రక్షణ భేరి' సభకు వెళ్లిన ఎర్ర సైనికులు

విజయనగరం ఫూల్‌బాగ్: అసమానతలు లేని సమాజం కోసం, పాలన కోసం సీపీఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరి బహిరంగ సభకు జిల్లా నుంచి ఎర్ర సైనికులు మంగళవారం తరలివెళ్లారు. విజయవాడలో బుధవారం జరగనున్న భారీ బహిరంగ సభకు జిల్లా నుంచి బస్సుల్లో, రైళ్లో, ప్రైవేటు వాహనాల్లో సీపీఎం శ్రేణులు తరలివెళ్లాయి. విజయనగరం పట్టణం నుంచి రెండు బస్సుల్లో తరలివెళ్తున్న ఎర్రసైనికులు బస్సులను సీపీఎం జిల్లా కార్యదర్శి టి.సూర్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి 'వేదిక'

నెల్లిమర్ల: విద్యుత్ వినియోగదారులు పరిష్కార వేదికలో సమస్యలు పరిష్కరించుకోవాలని వినియోగదారుల ఫోరం చైర్మన్, విశ్రాంత జిల్లా న్యాయమూర్తి బి.సత్య నారాయణ సూచించారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ వినియోగదారుల పరిష్కార వే దిక కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోరం చైర్మన్, విశ్రాంత జిల్లా న్యాయమూర్తి బి.సత్యనారాయణ మాట్లాడుతూ వినియోగదారులు విద్యుత్ సరఫరా లోపాలు, బిల్లుల లోపాలు, మీటర్ కాలిపోవడం, హై, లోఓల్టేజ్, తదితర సమస్యలు ముందుగా మీ పరిధిలో సహాయ ఇంజనీర్‌కి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదుపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా అధికార్లు నిర్లక్ష్యం వహిస్తే వినియోగదారుల ఫోరంను ఆశ్రయించవచ్చని విద్యుత్ రెగ్యులేటరీ అథారిటీ యాక్ట్ ప్రకారం న్యాయం జరుగుతుందని తెలిపారు. వినియోగదారుల ఫోరం సభ్యులు ఎస్.హరిబాబు, వి.జనార్ధన రావు, ఈఈ హరి, ఏఈ పిచ్చయ్య పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

విజయనగరంక్రైమ్: పట్టణంలోని డాబాతోట వద్ద పేకాట ఆడుతున్న వారిపై ఎస్ఈబీ పోలీసులు సమాచారంతో పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో అయిదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.15,200లు నగదు స్వాధీనం చేసుకున్నారు. దాడిలో వన్ టౌన్ ఎస్ఐ శ్రీరామగణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

'ఆంధ్రాకు మళ్లీ జగనే కావాలి'



నెల్లిమర్ల: నగర పంచాయతీలోని జరజాపుపేట 1వ సచివాలయం వద్ద సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డులను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు

వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం అన్ని చోట్ల విజయవంతంగా పండగ వాతావరణంలో కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఆవిష్కరిస్తున్న సంక్షేమ పథకాల బోర్డుల ద్వారా లబ్ధిదారులకు అందుతున్న సంక్షేమ ఫలాలను పార్టీ శ్రేణులు సవివరంగా వివరిస్తున్నారు. నాలుగున్నరేళ్ల కాలంలో జగనన్న పాలనలో రాష్ట్రంలో లబ్ధి పొందిన వివరాలు పూర్తి స్థాయిలో ప్రదర్శిస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలో... ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు క్షేత్ర స్థాయిలో ప్రజలకు వివరిస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



డెంకాడ: చింతలవలస-2 పరిధిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు తదితరులు



నెల్లిమర్ల రూరల్: తంగుడుబిల్లి సచివాలయం వద్ద డిజిటల్ బోర్డును ప్రదర్శిస్తున్న ఎంపీపీ సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాశినాయుడు, తదితరులు



విజయనగరం: డివిజన్ ప్రజలకు జరిగిన లబ్ధిని వివరిస్తూ ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న నగర మేయర్ విజయలక్ష్మి



భోగాపురం: సవరవిల్లి సచివాలయలం వద్ద పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



విజయనగరం రూరల్: దుప్పాడలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ మామిడి అప్పలనాయుడు

నేటి బాలలే భావి భారత పౌరులు



విజయనగరం: చిన్నశ్రీను సోల్జర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలలకు బహుమతులు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మజ్జి సిరిసహస్ర తదితరులు



విజయనగరం: అంధ విద్యార్థులతో వాసవీ క్లబ్ ప్రతినిధులు

నేటి బాలలే భావి భారత పౌరులని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, విజయనగరం డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా మంగళవారం పలుచోట్ల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న వారు బాలల భవిష్యత్‌ను అందంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. బాలల భవిష్యత్‌తోనే సమాజాభివృద్ధి ఆధారపడి ఉందన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సామాజిక సేవకులు తదితరులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



విజయనగరం: వివిధ రకాల వేషధారణలతో వచ్చిన బాలలతో కార్పొరేషన్ విద్యాకమిటీ ప్రతినిధులు



విజయనగరం ఫోర్ట్: సీపీ గుడి అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన బాలల దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ అనురాధ



విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ జీవీలో మొక్కలు నాటుతున్న వీసీ ప్రొఫెసర్ కె.వెంకట సుబ్బయ్య, ఈసీ సభ్యులు డాక్టర్ శశిభూషణరావు



నెల్లిమర్ల: ఆదిత్య విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు



డెంకాడ: ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థినుల నృత్య ప్రదర్శన

పిల్లల కోసం నెహ్రూ పార్కు అభివృద్ధి : కోలగట్ల



కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: చిన్న పిల్లలు ఆహ్లాదకర వాతావరణంలో గడపడంలో భాగంగా నగరంలోని నెహ్రూ పార్కును అభివృద్ధి చేయనున్నట్టు ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి వెల్లడించారు. నగరంలోని 17వ డివిజన్ నెహ్రూ పార్క్‌ను అత్యాధునిక హంగులతో ప్రత్యేకంగా బాలల కోసం పార్కు నిర్మాణానికి నిర్ణయించగా... బాలల పార్కు నిర్మాణ పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మంగళవారం శ్రీకారం చుట్టారు. అనంతరం కోలగట్ల మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన నెహ్రూ పార్కును పునరుద్ధరించే దిశగా నూతనంగా పార్కును ఏర్పాటు చేసి ప్రత్యేకించి బాలల కోసం రూపొందిస్తున్నట్టు వెల్లడించారు. ఇప్పటికే నగరంలో మహిళల కోసం ప్రత్యేకంగా పార్కును ఏర్పాటు చేసి మహిళా పార్కుగా తీర్చిదిద్దామన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని పిల్లల కోసం ప్రత్యేకమైన పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందన్నారు. అత్యధిక క్రీడా సామగ్రిని పార్కులో ఏర్పాటు చేసి పిల్లలు మరింత ఆనందంగా, సరదాగా గడిపేందుకు పార్కును ఏర్పాటు చేస్తున్నామన్నారు. మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయా యాదవ్, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి.రాజేష్, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, స్థానిక కార్పొరేటర్ ఆశపు సుజాత, కార్పొరేషన్ ఈఈ దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

మంచి పుస్తకంతో మానవ జీవితంలో మార్పు



మాట్లాడుతున్న నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం అర్బన్: మంచి పుస్తకాలు మనిషి జీవితంలో గొప్ప మార్పును తీసుకువస్తాయని విజయనగరం నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. ఇంటర్నెట్ నుంచి తెలుసుకున్న విజ్ఞానం పుస్తకపఠనం ద్వారా తెలుసుకున్నది మదిలో నిలిచిపోతుందని, ప్రతీ ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని కోరారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆమె మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు చదువుతో పాటు సమాజం పట్ల అవగాహన అవసరమని అన్నారు. జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి మాట్లాడుతూ పుస్తక పఠనం ప్రతీ ఒక్కరికీ అవసరమని మంచి పుస్తకాలను అధ్యయనం చేయడం అలవాటు చేసుకోవాలని కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రొంగళి పోతన, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.లక్ష్మి, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌బీఎల్ పరిశ్రమ వితరణ



అంగన్‌వాడీ కార్యకర్తకు బోధనా పరికరాలు అందజేస్తున్న జీఎం సునిల్‌కుమార్ తదితరులు

పూసపాటిరేగ: నేటి బాలలే భావితరాలకు మార్గదర్శకాలు అని హెచ్‌బీఎల్ పరిశ్రమ జనరల్ మేనేజర్ సునిల్‌కుమార్ అన్నారు. మండలంలోని హెచ్‌బీఎల్ పరిశ్రమలో బాలల దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ చిన్నారులకు బోధనాంశాలకు సంబంధించిన పరికరాలు మంగళవారం పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు మంచి పౌష్టికాహారం అందించినట్లయితే శారీరకంగా, మానసికంగా ఎదుగుతారన్నారు. పూసపాటిరేగ మండల పరిధిలో 31 అంగన్‌వాడీ కేంద్రాలలో 600 మంది చిన్నారులకు పరిశ్రమ సహకారంతో ప్రతి రోజు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో మరి కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలను దత్తత తీసుకొని పౌష్టికాహారం అందిస్తామని హామీ ఇచ్చారు. చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందడం ద్వారా మరింత వ్యాధి నిరోధక శక్తి ఉంటుందన్నారు. కార్యక్రమంలో భోగాపురం ఐసీడీఎస్ సెక్టార్ ఏపీఓ తవిటినాయుడు, సూపర్‌వైజర్ సత్యవతి, హెచ్‌బీఎల్ పరిశ్రమ ప్రతినిధులు అబ్దుల్ కలాం, సునిల్‌రావ్, రామకృష్ణ, రాజేష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష' ప్రజలకు రక్ష

విజయనగరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు ఆరోగ్య రక్షనిస్తుందని నగర మేయర్ విజయలక్ష్మి అన్నారు. నగరంలోని 11వ డివిజన్ కాటవీధి పాఠశాలలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. శిబిరాలకు పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి మందులు ఉచితంగా అందజేశారు.



విజయనగరం: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మేయర్ విజయలక్ష్మి

'సామాజిక సేవలో ముందుండాలి'



క్రికెట్ మ్యాచ్ ఆడుతున్న క్రీడాకారులు

విజయనగరం: సామాజిక సేవలో ఎల్లప్పుడూ ముందుండాలన్నదే తమ అభిమతమని బిజినెస్ యూత్ ఆఫ్ విజయనగరం ప్రతినిధులు పేర్కొన్నారు. గోకపేట పాఠశాల శిథిలావస్థకు చేరడంతో స్థానికుల అభ్యర్థన మేరకు నూతనంగా నిర్మించేందుకు బిజినెస్ యూత్ ఆఫ్ విజయనగరం ముందుకొచ్చింది. ఈ మేరకు నిధులు సమీకరణ కోసం క్రికెట్ మ్యాచ్‌ను నిర్వహించారు. పోటీలను నిర్వహించి నిధుల సేకరణకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధులు ఈశ్వర్ కౌషిక్, వైగేర్ ప్సదార్, కేదారిశెట్టి లక్ష్మణమూర్తి మాట్లాడుతూ సామాజికంగా ఏ అవసరమున్నా తమ సంస్థ ద్వారా అందించేందుకు ముందుంటామన్నారు. గోకపేట పాఠశాల శిథిలావస్థకు చేరడంతో దాన్ని పునర్నించేందుకు నిధుల సేకరణకు క్రికెట్ మ్యాచ్‌ను నిర్వహిస్తున్నామన్నారు.

ప్రజా భాగస్వామ్యంతోనే అభివృద్ధి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ప్రజా భాగస్వామ్యంతోనే అభివృద్ధి పనులు చేపడుతున్నామని శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చటంలో భాగంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. నగరంలోని 14వ డివిజన్ శుద్ధి వీధిలో 20 లక్షల రూపాయలతో నిర్మించనున్న రహదారులకు కోలగట్ల మంగళవారం శంకుస్థాపన చేసారు. పనుల ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఆయనకు స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. గజమాలలతో సత్కరించారు. అనంతరం నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ నగర అభివృద్ధే ధ్యేయంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో గుర్తించి అంశాలను ఒక్కొక్కటి నెరవేర్చుతూ అభివృద్ధి దిశగా పనులు చేపడుతున్నామన్నారు. ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్ మాట్లాడుతూ కార్పొరేషన్ స్థాయిలో అభివృద్ధి పనులు నగరంలో జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ లయ యాదవ్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవరత్నాలతో ప్రతి కుటుంబానికీ లబ్ధి

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: నవరత్న పథకాలతో ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. సవరవిల్లి పంచాయతీ ఉప్పాడపేట, వెంపాడపేట, రామదాసుపేట, నందికోపేట మధుర గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, ఎంపీపీ ఉప్పాడ అనూషరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పట్నా తాతయ్యలుతో కలిసి ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్ల ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. అవినీతికి తావు లేకుండా తమకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని పలువురు లబ్ధిదారులు ఎమ్మెల్యే ఎదుట సంతోషం వ్యక్తం చేశారు. తహసీల్దార్ చింతా బంగార్రాజు, ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పాడ శివారెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ సారధి సీఎం జగనన్న

విజయనగరం రూరల్: రాష్ట్రంలో నాలుగున్నరేళ్లుగా సంక్షేమ పాలన సాగిస్తున్న మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సారధిగా నిలిచారని విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కోరుకొండ సచివాలయం పరిధిలో కోరుకొండ, నెయ్యిలపేట, హెచ్.కొత్తూరు గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు.

మధుమేహ వ్యాధి పట్ల తస్మాత్...

- ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల



సర్వజన ఆస్పత్రి వద్ద ర్యాలీలో పాల్గొన్న ప్రిన్సిపాల్ పద్మలీల, సూపరింటెండెంట్ అనిలాసునందని తదితరులు

విజయనగరం ఫోర్ట్: మధుమేహ వ్యాధి జీవితంలోకి రాకుండా చూసుకోవాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలీల అన్నారు. ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సరైన ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ లేకపోవడం, జంక్ ఫుడ్స్ ఎక్కువగా తినడం వల్ల మధుమేహ వ్యాధి బారిన ప్రజలు పడుతున్నారని అన్నారు. సమతుల్య ఆహారం తీసుకోవడం, ప్రతి రోజు వ్యాయామం తీసుకోవడం ద్వారా మధుమేహ వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చునని చెప్పారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు వైద్యుని సలహా మేరకు మందులు వాడాలన్నారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిలాసునందని, వైద్యులు డాక్టర్ సుదర్శి, డాక్టర్ పద్మావతి, డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ ఆదిత్య వర్మ తదితరులు పాల్గొన్నారు.

మధుమేహంతో కంటి సమస్యలు

విజయనగరం ఫోర్ట్: మధుమేహం నియంత్రణలో లేకపోతే కంటి సమస్యలు వస్తాయని వైష్ణవ్ ఐ కేర్ సెంటర్ వైద్యులు బాక్టర్ బాలి తనూజ తెలిపారు. స్థానిక వైష్ణవ్ ఐకేర్ సెంటర్‌లో ప్రపంచ మధుమేహ దినోత్సవం సందర్భంగా ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కంటివైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు గద్దె చిరంజీవి, మురళీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వరి పంట పరిస్థితిని నివేదించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వాసుదేవరావు

డెంకాడ: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వరి పంట పరిస్థితిని వివరించాలని వ్యవసాయాధికారులను ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, సభ్యులు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. సమావేశంలో వ్యవసాయాధికారి పూడి నిర్మల మాట్లాడుతూ మండలంలో ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, వీటిపై ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రాథమిక సమచారాన్ని అందించామని తెలిపారు. దీంతో ఎంపీపీ వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, డెంకాడ పీఏసీఎస్ చైర్మన్ రొంగలి కనకసింహాచలం, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మాట్లాడారు. వర్షాలు చివరిలో ముఖం చాటేయడం వలన వరి బాగా దెబ్బతిందని, దీనిపై సమగ్ర సమాచారాన్ని ప్రభుత్వానికి చేరవేయాలన్నారు. తాము కూడా జిల్లా ప్రజాప్రతినిధులకు పరిస్థితులను వివరిస్తామన్నారు. త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని ఏఓ చెప్పారు. డెంకాడ, మోపాడ పీహెచ్‌సీ డాక్టర్లు ఎం.శివరామకృష్ణ, యోగితబాల జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా గుర్తించిన రోగులకు తగిన వైద్యం అందిస్తున్నామని తెలిపారు. కంటి రోగులకు కంటి ఆపరేషన్లు కూడా చేయించేందుకు పంపిస్తున్నామని వివరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ కూరాకుల అనిత, ఎంపీడీఓ డీడీ స్వరూపారాణి, డీటీ సూర్యకాంతం, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండలంలోని వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

భోగాపురం: ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని సీఐ బివి.వెంకటేశ్వరరావు అన్నారు. ఎస్పీ దీపిక ఆదేశాల మేరకు మంగళవారం సీఐ, ఎస్ఐలు కృష్ణమూర్తి, సూర్యకుమారిలతో కలిసి అక్కివరం, ఏ రావివలస జంక్షన్ల వద్ద వాహనాల తనిఖీ మంగళవారం చేపట్టారు. రికార్డులు లేని వాహనాలను సీజ్ చేశారు. సిబ్బంది పాల్గొన్నారు.